కథానిక :

# సంతృప్తి

శ్రీ నేరళ్ల లక్ష్మణరావు

మానవుని మనస్సు మళ్ళించటానికి ప్రయత్నం చెయ్యడం చాలా ప్రమాదం. మానవునిమనస్సు మళ్ళించటానికి తోటిమానవుని తరంకాదు. అట్టి స్థితిలో యీ రాజకీయవేత్తలు, సంస్కర్తలు మానవప్రవృత్తులను మార్చటానికి చేసే ప్రయత్నాలను చూస్తూవుంటే యెంతో ఆశ్చర్యం వేస్తూంది. ఒకరికి యే విషయంలో నైనా సలహా యివ్వాలంటే నాకెంతో చిన్నతనంగా వుంటుంది. అసలు మనం యే విధంగా నడచుకోవాల్సింది మనకే తెలియదే, 'ఫలానావిధంగా నడచుకోండి' అని యితరులని యెల్లా శాసించగలుగుతాం.

నామట్టుకి నాకు, నా విషయమే నాకు బాగా తెలియదు, యితరుల విషయాన్ని తెలుసుకోవటానికి వ్యర్థప్రయత్న మెందుకు? మన సామాజికుల మనోప్రవృత్తులను మనం కొంచంకొంచంగా వూహించగలం. ప్రపంచంలో ప్రతిమానవుడు కర్మపాశంచేత బంధింపబడ్డవాడే. ఒక మానవుడు మరొక మానవునితో యేదో రూపేణా తన మనోప్రవృత్తులను తెలియచేస్తాడు. దాని అర్థం యితరులకు వేరుగా వుండవచ్చు. కాని మానవసహజం అది ఎంతప్రయత్నం చేసినా అరికట్టలేడు. తానేదో గొప్పవాడని భ్రమిస్తాడు. అంతా వట్టిదే. వట్టిదని మనకి తెలుసు, మరి వాడికో...... .. అదే సృష్టి చమత్కారం.

మానవుడు జీవితంలో అనేకతప్పులని చేస్తాడు. 'తప్పులని దిద్దుకోవటానికి ప్రయత్నం చెయ్యడు. అసలు అతను చేసేది ప్రతిది వొప్పనే అతని నమ్మకం ఇది, కూడా సృష్టివైపరీత్యమే

అసలు యీ మాటలన్నీ చెప్పటానికి నేనెవరిని? మానవుని జీవితాన్ని ఋజుమార్గంలో నంచటానికి . మానవునికి సాధ్యమా? జీవితం కడు దుర్భరమైనది, చంచలస్వభావం కలది, అట్టి అసంతృప్తికరమైన, అప్రమేయమైన జీవితాన్ని సక్రమంగా నడపటం కూడా దుర్భరమైన వ్యాపారమే.

నా జీవితంలో నే నిప్పటికి సంపూర్ణ జీవిని కాలేదు. అట్టి స్థితిలో నా సోదరుని జీవితాన్ని నిర్ణయించటానికి నే నెవరిని? కాని, కొంతమంది తమ జీవితరంగప్రప్రథమంలోనే దెబ్బతింటారు. అట్టివారికి మనం సహాయం చేయక తప్పదు. నా మిత్రులు నన్ను, యీ జీవితంగడిపే మార్గం యెల్లాగని అడుగుతూ వుంటారు. నేను వారికిచ్చే సమాధానం యిల్లాగుంటుంది, "ప్రతి మానవుని జీవితం అతని కయోమయంగాన, అగమ్యగోచరంగానే వుంటుంది. ప్రతి మానవుడు విధికి కట్టుబడి వుండవలసిందే. విధినిమాము కొన్ని దాటటానికి మన పూర్వులకే అసాధ్యమయింది, మన మనగా యెంత వాళ్లం," అని వాళ్లని సమాధానపరుస్తూ వుండేవాణ్ణి.

ఒక్క పర్యాయంమాత్రం నే నొకాయనకు అద్భుతమైన సలహా నిచ్చేను. నా జీవితంలో నేను చేసిన ఘనకార్యం అదే

అప్పటికి నేను చాలా చిన్నవాణ్ణి. అంటే షుమారు పాతికేళ్లుంటాయి. ఎప్పుడూ యేదో వ్రాస్తూనే వుండేవాణ్ణి. చిన్నప్పటి నుంచి మిస్టిసిజ మంటే నాకెంతో యిష్టం. తదితరవిషయాల్లో కూడా కొద్దో గొప్పో పరిచయం వున్నవాణ్ణి. నా వాలుకుర్చీలో కూర్చుని యేవో ఆలోచిస్తున్నాను. వూహాపథంలో పెద్దవి, చిన్నవి, పాతవి, క్రొత్తవి ఆలోచనలెన్నో పరువు లెడుతున్నాయి. ఇంతలో తలుపు చప్పుడయింది. దిగ్గనలేచి తలుపు తీసాను.

ఎవరో ఒక అపరిచిత వ్యక్తి నా వైపు తదేకదీక్షతో చూస్తూ ముందుకు వస్తున్నాడు. చేతిలో కర్రా, కళ్లకి జోడూ వున్నాయి సుమారు ముప్పది సంవత్సరా లుండవచ్చు. వెంటనే ఆ వ్యక్తి ఆగి, "క్షమించండి... తమ నెక్కడో చూచినట్లుంటే... ." అన్నాడు.

"ఫరవాలేదు మీరు నన్నీ వూళ్లోనే చూచివుండాలి. ఎందుచేతనంటే నే నీవూరు దాటి యెప్పుడూ యెక్కడికీ వెళ్లలేదు." అన్నాను.

"అవునవును.. యీ వూళ్ళోనే టౌన్ హాల్లో తాము వుపన్యాసం చెబుతూ వుంటే." అన్నా డా వ్యక్తి. (చిన్న నవ్వుతో)

"మాస్తే చూచి వుండవొచ్చు...తాము వచ్చిన కార్యం?"

"అబ్బే యేముంది తమ దర్శనం ఒక్క పర్యాయం చేసిపోదా మని వచ్చాను. తాము వ్రాసిన కొన్ని గ్రంథాలని చదివి అమితానందభరితుడి నయ్యాను. మీరు వ్రాసిన విషయాలలో కొన్ని అనుమానములు వచ్చి మిమ్మల్ల నడిగి సందేహనివారణ చేసుకుందామని వచ్చాను."

"అంతకన్నా యేముంది, తప్పక అడగవచ్చును. నాకు తెలిసినవిధంగా మీ అనుమానాలని తీర్చటానికి ప్రయత్నంచేస్తాను," అన్నాను.

"తాము స్పెయిన్‌ను గురించి వొక గ్రంథం వ్రాసారు. ఆగ్రంథాన్ని చదువుతూ వుండగా నాకు కొన్ని అనుమానాలు వచ్చేయి."

"తప్పక అడగండి...మరోలా అనుకోవద్దు, ఆ పుస్తకంలో యేమయినా లోపాలుంటే సెలవివ్వండి, తప్పక దిద్దుకుంటాను."

"అబ్బే! లోపాలు కనిపెట్టేటంత సమర్థుణ్ణి కాను లెండి—నే నొకచిన్న వైద్యుణ్ణి యీ దేశం వదిలి స్పెయిన్ వెళ్దా మనుకున్నాను. బాబూ! అక్కడ మనజాతి వాళ్లెవరేనా వుంటారా అండి? అసలు నాకు పరాయిదేశం వెళ్ళడ మంటే చాలా భయం. చిన్నప్పటినుంచి ఒకేవూళ్ళో పుట్టి పెరిగినవాణ్ణి. లోకజ్ఞానం కొంచం తక్కువ. నాకు చిన్నప్పుడే మావాళ్లు వివాహం

చేసారు. పిల్లలింకా స్వామీ దయవల్ల లేరు లెండి. మామూలుగా వైద్యం చేస్తూ వుంటాను నాకిక్కడేమీ కిట్టుబాటు కావటంలేదండి. మీరు వ్రాసినదాన్ని బట్టి చూస్తే అక్కడేమయినా నాలుగు డబ్బులు దొరుకుతాయేమోనని. అయినా మీ వుద్దేశం యేమంటారు?"

అతని ధోరణి చూచి నాకు చాలా ఆశ్చర్యం వేసింది. "ప్రపంచంలో యిల్లాంటివాళ్లుకూడా వుంటారు కాబోలు", అనుకున్నా. అతడు చాలా పొట్టివాడు. కొంచం నల్లగా వుంటాడు, దట్టంగా గడ్డాలు మీసాలు వున్నాయి చాలా చలాకీయైన మనిషి కొంచంసేపు సైకాలజీ స్టడీ చేసి, యిల్లా ప్రారంభించాను.

"తప్పక మీరు స్పెయిన్ వెళ్లవలసిందే మీకు అభివృద్ధి సూచనలున్నాయి," అన్నాను

"అసలు వైద్యవృత్తి అంటేనే, ప్లీడరు వృత్తివంటిది వస్తే బోలెడు వస్తుంది లేకపోతే మొదటికే మోసం వస్తుంది అందుకనే మనవాళ్లు, వైద్యుడికి చెయ్యి, ప్లీడరుకి నోరు మంచిది కావాలంటారు."

"నిజమే. అల్లాగ నని మనప్రయత్నం మానేస్తామంటారా? మనప్రయత్నం మనం చేస్తే మిగతాది భగవంతుడు పూర్తి చేస్తాడు అయినా మీలాంటి పెద్దలకి నేను చెప్పవలసినవాణ్ణి కాననుకోండి" అన్నాను.

"నా పెద్దరికం చట్టుబండలయినట్లే వుంది. బుద్ధిమంతులయితే చాలు చిన్నా పెద్ద యెవ్వరూ చూడరు."

"మీరు, నామీద వున్న ప్రేమచేత అల్లాగా మాట్లాడుతున్నారుగాని, అసలు నాలో యేమీ గొప్పతనంలేదు. అసలు మీరొచ్చిన పని మరచిపోయారు. మీరు స్పెయిన్ వెళ్లటం మీ భార్య కిష్టమేనా?

"నా భార్య కిష్టమే"

"అవుతే చాలా కష్టమే!'

"అవును ఆ సంగతి నాకు తెలుసు. మీరెల్లా చెబితే అల్లా చెయ్యటానికి సిద్ధంగా వున్నాను ఉండమంటే వుంటాను లేదు వెళ్లమంటే అక్కడికే వెళ్లుతాను."

"ఇది మీ జీవితానికి సంబంధించిన సమస్య, దీన్ని మీరే యథోచితంగా పరిష్కరించుకోవటం చాలా మంచిది. మీ విషయంలో నాకేమీ అట్టే తెలియదు. అయినా మీరింతగా అడుగుతున్నారు గనుక ఒక్క విషయంమాత్రం చెప్పగలను మీకు ధనాశవుంటే అక్కడకి వెళ్లటం అనవసరం. ధనాశ లేక,యేదో జీవితం సుఖంగా గడచిపోతే చాలనుకుంటే, స్పెయినంత స్వర్గం మరొకటి లేదు ఈ రెండింటిలో మీ సమ్మతం యేమిటో ఆలోచించుకోండి వున్న విషయాన్ని చెప్పాను."

"చాలా సంతోషం, మీరు నాకు గొప్ప వుపకారం చేసారు. ధన్యుణ్ణి వెళ్లి వస్తాను," అని ఆ వ్యక్తి వెళ్లిపోయాడు

ఆ యుదంతం రెండు మూడు రోజుల వరకు జ్ఞాపకం వుంది తరువాత పూర్తిగా మరచిపోయాను.

## 2

పదిహేనసంవత్సరాలు అవలీలగా గడచిపోయాయి. ఒక పర్యాయం నేను స్పెయిన్ వెళ్లవలసివచ్చింది అక్కడ సెవిల్లీ నగరంలో ఒక హోటల్లో బస చేసాను ఆసమయంలో నాకు కొస్త సుస్తీ చేసింది. ఆ హోటలుకుర్రాడిని పిలిచి, "అబ్బాయీ! యీ వూళ్ళో యెవ్వరయినా యింగ్లీషు వైద్యుడున్నాడా? అని అడిగాను ఆ కుర్రాడు, "యిక్కడికి షుమారు మూడుమైళ్ల దూరంలో ఒక వైద్యుడున్నాడండి," అన్నాడు

"సరే టాక్సీ తీసుకురా అక్కడికి వెళ్ళదాం," అన్నాను.

ఆ కుర్రాడు టాక్సీ తీసుకొచ్చాడు. యిద్దరం కలసి అక్కడికి వెళ్లాం.

ఆ వైద్యుడు నేను వెళ్ళడంతోటే తన సీటు మీదనుంచి లేచి నన్నొక వున్నతాసనం మీద కూర్చోపెట్టాడు. అతడు నాకు చేసే పరిచర్యలను చూచి నాకెంతో ఆశ్చర్యంవేసింది ఏదో చిరకాలపు మిత్రుడ్ని కలుసుకుంటే పడే ఆనందాన్ని అతడనుభవిస్తున్నాడు. నాకదంతా అయోమయంగా వుంది.

"క్షమించండి.. తమ రెవరో నాకర్థం కావటం లేదు నాకోసం తమరు చాలా కష్టపడుతున్నారు", అన్నా.

"నన్ను మీరు మరచిపోయి వుంటారు. కాని నేనుమాత్రం మిమ్మల్ని మరచిపోలేదు. ఇదంతా మీరు పెట్టిన భిక్షే నాలో అద్భుతమయిన మార్పును తెచ్చారు యిప్పటికైనా గుర్తుతెచ్చుకొన్నారా? అన్నాడా వైద్యుడు.

ఒక్క పర్యాయం, పదిహేను సంవత్సరాల క్రితం జరిగిన యీ యుదంతం కోసం నా స్మృతిగ్రంథాన్ని తిరిగేసాను మళ్లా, అంతా కళ్లకి కట్టినట్లువుపించింది.

"అవును గుర్తొచ్చింది మిమ్మల్ని మరచినందుకు క్షమించండి," అన్నాను.

తర్వాత నే నొచ్చిన పనిని చెప్పాను అతడెంతో ఆప్యాయంగా నాకు మందిచ్చి నన్ను చాలా గౌరవించాడు. నావద్దనుంచి ఒక్కదమ్మిడీ అయినా తీసుకోలేదు. తన గృహాన్ని చూపించాడు. తన భార్యకి స్పెయిన్ వాతావరణం నచ్చకపోవడం వల్ల తన స్వదేశానికి ఆవిడ వెళ్లిపోయింది ఈ వైద్యుడు మరొక స్పేనిష్ యువతిని వివాహం చేసుకొని సుఖంగా జీవితం గడుపుతున్నాడు

"మీరు నాకు గురువులు. మీరు చెప్పిన మాటలు అక్షరాలా నిజమయ్యాయి. నాకే మాత్రం ధనాశ లేదు. జీవితం సుఖంగా గడచిపోతే చాలు. పెద్ద మేడలుమిద్దెలు కట్టనక్కర్లేదు. జీవితంలో యెన్నివున్నా సంతృప్తి లేకపోతే ఆ మానవుని జీవితం దుఃఖమయమే. నేను మహారాజుకంటే యెక్కువ ఆనందాన్ననుభవిస్తున్నానని చెప్పటానికి గర్వపడుతున్నాను కనుక మానవునికి సంతృప్తి అగత్యవసరం.

* (కథామస్తువు, సోమర్ సెట్ మాఘం నుండి).

---


# శ్రీ మద్భగవద్గీత

వ్యాఖ్యాత శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు

పంచమ ముద్రణము వెల రూ 4-0-0

(ప్యాకింగు, పోస్టేజి రూ 0-9-0)

సంస్కృత మూలము. శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారు వ్రాసిన తెలుగు టీకా తాత్పర్య విశేషార్థ వివరణలుగల 400 పుటల గ్రంథము. గీతాధ్యయనము చేయువారికి ఎక్కువ ఉపయుక్తమైనది కద్దరు బైండు.

ఆంధ్ర గ్రంథమాల,

తపాలాపెట్టె 212, మద్రాసు.